RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 28 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 168 | పేజీలు: 4 | వెల: రూ.5/-




## 'వారిని విధుల్లోకి తీసుకోండి.. లేదంటే మమ్మల్ని సస్పెండ్ చేయండి'

ఆగని ఖాకీల ఆందోళనలు

2లో..



కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో అర్ధరాత్రి

## భారీ శబ్ధాలతో పార్టీ

### రైడ్ చేసిన పోలీసులు.. డ్రగ్స్ గుర్తింపు

**హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్ జన్వాడలోని ఫామ్‌హౌస్‌పై సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. జన్వాడ రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్‌పాకాల ఫామ్ హౌస్‌లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు. భారీ శబ్దాలతో పార్టీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. పార్టీలో పాల్గొన్న 24 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, ఓ వ్యక్తికి కొకైన్ పాజిటివ్ గా నిర్ధారణ అయింది. కొకైన్ తీసుకున్నట్లు పరీక్షలో తేలడంతో ఎన్ డీపీఎస్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో పోలీసులు విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ యాక్ట్ సెక్షన్ 34 కింద మరో కేసును నమోదు చేశారు.

భారీగా విదేశీ మద్యం స్వాధీనం : మద్యం పార్టీలో మొత్తం 35 మంది పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. పాల్గొన్న వారిలో 21 మంది పురుషులు, 14 మంది మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫామ్‌హౌజ్ యజమాని రాజ్ పాకాలా కేటీఆర్ బావమరిదిగా గుర్తించారు. విజయ్ మద్దూరి అనే వ్యక్తి కొకైన్ తీసుకున్నట్లు పోలీసుల పరీక్షల్లో నిర్ధారణ అయింది. కొకైన్ తీసుకున్నట్లు పరీక్షలో తేలడంతో ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మద్యం పార్టీ చేశారని పోలీసులు గుర్తించారు. ఈ పార్టీలో విదేశీ మద్యం సహా, భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేపట్టినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీలత

..మిగతా 2లో

అది ఫామ్‌హౌజ్ కాదు..

## నా బావమరిది ఉండే ఇల్లు

### అది రేవ్ పార్టీ కాదు.. ఫ్యామిలీ దావత్: కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు):** తన బావమరిది ఇంట్లో జరిగిన ఫ్యామిలీ దావత్‌ను రేవ్ పార్టీ అంటూ ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మధ్యే జన్వాడలో తాను ఒక ఇల్లు కట్టుకున్నాడని.. ఇండ్లల్లోకి వెళ్లినప్పుడు అందర్నీ పిలవలేదని దసరా, దీపావళి సందర్భంగా పిలుచుకున్నాడని అని చెప్పారు. కానీ కొంతమంది దాన్ని రేవ్ పార్టీ అని

..మిగతా 2లో

# ఎట్టకేలకు హైదరాబాద్ మెట్రో విస్తరణ

## సంతోషం వ్యక్తం చేస్తున్న హైదరాబాదీలు



- ప్రపంచంలోనే ఐకాన్ మహా నగరంగా దూసుకుపోతున్న
- హైదరాబాద్‌కు మెట్రో విస్తరణ వస్తుండడంతో గొప్ప వరం లాంటిది
- మెట్రో అంటేనే హైదరాబాద్ అనే పర్యాయ పదం రానున్నది.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రివర్గ సహచరులను అభినందించాల్సిందే!!
- మెట్రో రైల్ విస్తరణతో హైదరాబాద్ మహా నగర ప్రజలు సంతోషంలో మునిగి తేలుతున్నారు.
- మెట్రో సర్వే పనులు వెంటనే మొదలు పెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

**హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు):** మెట్రో ఎప్పుడు??? ఎప్పుడా!!!! అని ఎదురుచూస్తున్న హైదరాబాద్ నగర వాసులకు తెలంగాణ రేవంత్ రెడ్డి ప్రభుత్వం" చేదులో తీపి" కబురు చెప్పి యావత్తు ప్రయాణికులకు దీపావళి పండుగను సురిసురి బత్తులతో ఘనంగా దీపావళి చేసుకోమని చెప్పకనే చెప్పింది. హైదరాబాదును ప్రపంచ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకునేటట్లు చేస్తాను.. అన్న రేవంత్ రెడ్డి మాటలను తెలంగాణ ప్రజలు ఒక కన్ను వేసి కని పెడుతున్నారనే విషయాన్ని గుర్తించి, తెలంగాణ ప్రజల మౌలిక అవసరాలు, సమస్యలపై పాలన సాగించాలని సమస్త తెలంగాణ సమాజ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుకుంటున్నది. హైదరాబాద్ నగర ప్రజలకు మెట్రో ప్రాముఖ్యత గురించి ప్రభాత సూర్యుడు పత్రిక ఒకవైపు మెట్రో యాజమాన్యానికి, రెండో వైపు రాష్ట్ర ప్రభుత్వానికి, ఇంకో అడుగు ముందుకేసి కేంద్ర ప్రభుత్వ దృష్టి కూడా మెట్రో రైల్ హైదరాబాద్ కు ఒక మణిహారం అని వరస కథనాలతో ప్రజల పక్షాన పత్రిక నిలబడి ప్రభుత్వాలను ఆలోచింప చేసే వరకు ప్రభాత సూర్యుడు వెళ్లిందంటే మెట్రో రైల్ ప్రాముఖ్యత!!! కాదు!! ప్రధాన అవసరం అని పాఠకులను పత్రిక పరంగా సంతృప్తి చేశామని భావిస్తున్నాం. ఏది ఏమైనా పాలనలో దూకుడుగా ముందుకు పోతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, సహచర మంత్రులను అభినందించాల్సిందే. ఇదే దూకుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్టు అయిన మూసీ నదిని పునర్జీవన నదిగా చేసి ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్, భువనగిరి యాదాద్రి, సూర్యాపేట, ప్రజలకు సాగునీరు, త్రాగునీరు అందేటట్లు చేసి చరిత్రలో రేవంత్ రెడ్డి పేరును ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండేటట్లు ప్రభాత సూర్యుడు పత్రిక మరొకసారి గుర్తుచేస్తుంది. అలాగే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టాలని, విమర్శకుల నోటికి తాళం వేయాలని కోరుతున్నాం.

# ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ ఉత్సవం



- హాకీ స్టిక్స్‌తో స్టెప్పులేసిన సీఎం రేవంత్
- హైదరాబాద్‌లో ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ సమ్మేళనం
- ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మూసీ అభివృద్ధికి యాదవులు అండగా నిలవాలని విజ్ఞప్తి
- ఈ సందర్భంగా సదర్ స్టెప్పులేసిన సీఎం

**హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు):** యాదవ జాతి నిత్యం అభివృద్ధిని కాంక్షించేదని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ అభివృద్ధికి సైతం యాదవులు అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ స్టేడియంలో సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను ముఖ్యమంత్రిగా ఉండడానికి ముఖ్య కారణం యాదవ సోదరులు ఇచ్చిన భరోసా అని గుర్తుచేసుకున్న ఆయన, తెలంగాణ ఉద్యమంలో అంజన్ కుమార్ యాదవ్ పాత్ర మరపురానిదన్నారు. అంజన్ కుమార్‌ను గెలిపించి ఉంటే మంత్రి అయ్యి ఉండేవారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సదర్ స్టెప్పులు : సదర్ అంటే యాదవుల ఖదర్ అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, యాదవులకు రానున్న రోజుల్లో పదవుల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. శ్రీకృష్ణుడిని ఆదర్శంగా తీసుకునే యాదవులు ధర్మం వైపు నిలబడాలని కోరారు. ఇక నుంచి ఏటా ప్రభుత్వమే అధికారికంగా సదర్ ఉత్సవం నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. మూసీ ఆధ్వానంగా తయారైందని, అందుకే మూసీని ప్రక్షాళన చేసి పునరుద్ధరించి అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ నగరం అభివృద్ధి చేయడం యాదవుల బాధ్యత కూడా అని ఉద్ఘాటించారు. యువకుడైన అనిల్ కుమార్‌ను రాజ్యసభకు పంపడం యాదవులపై ముఖ్యమంత్రికి ఉన్న ప్రత్యేక దృష్టికి నిదర్శనమని మంత్రి

..మిగతా 2లో






RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ ఉత్సవం

మొదటి పేజీ తరువాయి...

పొన్నం ప్రభాకర్ అన్నారు. కాగా ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి యాదవులు తరలివచ్చారు. అలాగే నగర నలుమూలల నుంచి యాదవులు సదర్ దున్నలను తీసుకువచ్చి ఆడించారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కోరిక మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సదర్ స్టెప్పులు వేసి అందరిని అలరించారు.

# అది ఫామ్‌హౌజ్ కాదు.. నా బావమరిది ఉండే ఇల్లు

మొదటి పేజీ తరువాయి...

సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. ఆ ఫ్యామిలీ దావత్‌లో 70 ఏళ్ల తన అత్తమ్మతో పాటు.. చిన్న పిల్లలు ఉన్నారని.. దాన్ని రేవ్ పార్టీ అని ఎలా అంటారని ప్రశ్నించారు. అసలు రేవ్ పార్టీ అంటే అర్థం తెలుసా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి వరుస వైఫల్యాలు. వంద రోజుల్లో చేస్తానన్న ఆరు గ్యారంటీలు కావచ్చు.. మూసీ కుంభకోణం కావచ్చు.. లేదా.. బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండరే కావచ్చు.. వారు చేస్తున్న వివిధ స్కామ్‌లను ఎండగడుతూ ప్రధాన ప్రతిపక్షంగా నిరంతరం బీఆర్ఎస్ పార్టీ ఈ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేవిధంగా వ్యవహరిస్తుంది. జంకకుండా, బెదరకుండా, ఎక్కడా రాజీ పడకుండా గత 11 నెలలుగా ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా అన్ని తట్టుకుంటూ మా కార్యకర్తలు, నాయకులు ధీరోదాత్తంగా కేసీఆర్ నేర్పిన ఉద్యమబాటలో నడుస్తూ వచ్చాం. ఈ రోజు వాటికి రాజకీయంగా సమాధానం చెప్పే సమర్థత లేదు. రాజకీయంగా మేం లేవనెత్తిన ప్రశ్నలకు వివరణాత్మకంగా ప్రజల్ని సంతృప్తిపరిచేవిధంగా సమాధానం చెప్పే పరిస్థితి అంతకంటే లేదు. ఆరు గ్యారంటీల అమలు గానీ.. ఇంకా చాలా విషయాలపై ప్రభుత్వంలో ఏ ఒక్కరూ ముందుకొచ్చి సమాధానం చెప్పే పరిస్థితి లేదు. అందుకే మమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోలేక.. మా కుటుంబసభ్యులు, మా బంధువుల మీద కేసులు బనాయించి, కుట్రలు చేసి, మా మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలి, ఆత్మస్థైర్యం దెబ్బతీయాలి, ఈ కుట్రలతో మా గొంతు నొక్కాలనే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లు కనిపిస్తుంది.’ అని కేటీఆర్ అన్నారు. కానీ రేవంత్ రెడ్డికి, రాహుల్ గాంధీకి చెప్పేది ఒక్కటే అని..



తాము ఉద్యమంలో అడుగుపెట్టిన నాడే చావుకు తెగించి వచ్చిన వాళ్లమని గుర్తుచేశారు. కేసులకో.. మీరు చేసే చిల్లర ప్రయత్నాలకు భయపడేవాళ్లం కాదని స్పష్టం చేశారు రేవ్ పార్టీ అంటూ ఇవాళ పొద్దుట్నుంచి ఒక ప్రహసనంలా ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ‘ ఇవాళ తెలంగాణలో ఒక కుటుంబం తన కుటుంబసభ్యులతో, బంధుమిత్రులతో దసరాకో, దీపావళికో.. తమ ఇంట్లో దావత్ చేసుకోవడం కూడా తప్పేనట. దానికి కూడా పర్మిషన్ కూడా తీసుకోవాలట. ఇది ఎన్నడూ లేదు కాబట్టి మాకు తెల్వది.’ అని అన్నారు. ‘ ఇక అది ఫామ్ హౌజ్ అని అంటున్నారు. అది ఫామ్‌హౌజ్ కాదు అది నా బావమరిది రాజ్ పాకాల ఉండే ఇల్లు. ఆయన హైదరాబాద్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఉంటుండె. అక్కడ ఇల్లు ఖాళీ చేసి 15 రోజుల కిందట జన్వాడలోని రిజర్వ్ కాలనీలో కట్టుకున్న ఇంటిలో గృహప్రవేశానికి వెళ్లిండు. ఇండ్లళ్లకు పోయినప్పుడు బంధుమిత్రులను పిలవలేకపోయిండు.. వాళ్లందర్నీ దసరా, దీపావళి సందర్భంగా పిలుచుకుని ఇండ్లళ్లకు పోయిన దావత్ అది.. ఫ్యామిలీ ఫంక్షన్ అది’ అని కేటీఆర్ స్పష్టం చేశారు. సోషల్‌మీడియాలో కొంతమంది పైశాచికత్వంతో అది రేవ్ పార్టీ అని చెబుతున్నారని మండిపడ్డారు. రేవ్ పార్టీ అంటే అసలు అర్థం తెలుసా మీకు. ఆ దావత్‌లో మా అత్తమ్మ ( నా భార్య వాళ్ల తల్లి ) ఉంది.. చిన్న పిల్లలు ఉన్నారు. రెండు, నాలుగు, ఏడేళ్ల వయసు ఉన్న పిల్లల నుంచి డెబ్బై ఏళ్ల వయసు ఉన్న పెద్దావిడ దాకా ఉంటే.. ఒక కుటుంబమంతా బంధుమిత్రులతో కలిసి భోజనం చేస్తుంటే.. దాన్నొక భూతద్దంలో పెట్టి రేవ్ పార్టీ అని ప్రచారం చేసి ఇవాళ పైశాచిక ఆనందం పొందుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అది ఫామ్‌హౌజ్ కాదు తన బావమరిది ఇల్లు అని.. అక్కడ జరిగింది ఫ్రెండ్స్, ఫ్యామిలీ గ్యాదరింగ్ అని పునరుద్ఘాటించారు. ‘ పురుషులు, మహిళలు పార్టీలో ఉన్నారని పొద్దుట్నుంచి మాట వింటూనే ఉన్నా.. వాళ్లు పురుషులు, మహిళలు కాదు.. భార్యాభర్తలు.. కుటుంబసభ్యులు. వాళ్లను కూడా విడదీసి పురుషులు, మహిళలు అంటూ అనుమానాలు కలిగేవిధంగా ప్రచారం చేశారు.’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు21 గంటలు శోధించి చివరికి తెలుసుకున్నదేంటని ప్రశ్నించారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వారి తీరు ఉందని ఎద్దేవా చేశారు.

డ్రగ్స్ ఆనవాళ్లు ఏమీ దొరకలేవని ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ సీఐనే స్టేట్‌మెంట్లు ఇచ్చారని చెప్పారు. ఫ్యామిలీ అంతా కూర్చొని పార్టీ చేసుకునే దగ్గర డ్రగ్స్ అని ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇక్కడ బాధాకరమైన విషయమేంటంటే.. పురుషులు, మహిళలు అంటూ అనుమానం కలిగేలా మాట్లాడటం దుర్మార్గమని అన్నారు. అక్కడ యూరిన్ టెస్టులు చేసింన్రు. పొద్దుట్నుంచి తన బావమరిదిని కాంగ్రెస్, బీజేపీ నాయకులు దూషిస్తున్నారని అన్నారు. ఇవాళ తన బావమరిదితో పాటు 12 మందికి నెగెటివ్ వచ్చిందని తెలిపారు. ఒక వ్యక్తిది మాత్రమే పాజిటివ్ వచ్చిందని అన్నారు. ఆ ఒక్కడికి పాజిటివ్ వస్తే ఆయన ఎక్కడ డ్రగ్స్ తీసుకున్నడో అది శోధించకుండా, ఇవాళ ఈ విచ్ హంటింగ్ ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



# డ్రగ్స్‌పై కేటీఆర్ ఇప్పుడేమంటారో

## బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు): బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది డ్రగ్స్ పార్టీలో పట్టుబడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. కేటీఆర్ బావమరిది ఫామ్హౌస్లోనే రేవ్ పార్టీలా అని ప్రశ్నించారు. తన బావమరిది రాజ్ పాకాల ఫామ్హౌస్లో డ్రగ్స్పై కేటీఆర్ ఏం సమాధానం చెబుతారో చెప్పాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ తీసుకుంటూ అడ్డంగా దొరికినా బుకాయిస్తాడేమో? అని చురకలు అంటించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే సమగ్ర విచారణ జరపాలని అన్నారు. పార్టీ జరిగే సమయంలో రికార్డ్ అయిన సీసీ ఫుటేజ్ సహా ఆధారాలు ధ్వంసం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. బడా నేతలతో సహా రేవ్పార్టీలో ఉన్న వాళ్లందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాం హౌస్లో రేవ్ పార్టీ కలకలం రేపింది. నిన్న సమాచారం అందుకున్న పోలీసులు.. ఫాం హౌస్ ల , ఓ తనిఖీలు చేపట్టారు. మొత్తం ఈ పార్టీలో 21 మంది మహిళలు, 14 మంది పురుషులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిన్న వీరందిరితో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల రేవ్ పార్టీ నిర్వహించాడు. పక్కా సమాచారంతో పోలీసుల దాడులు చేసి డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న వారందరికీ టెస్టులు జరిపారు. ఈ టెస్టులో విజయ్ మద్దూరి అనే వ్యక్తికి కొకెయిన్ పాజిటివ్ వచ్చింది. విజయ్ మద్దూరిపై కేసు నమోదు చేశారు. పర్మిషన్ లేని 10 లీటర్ల ఫారిన్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలపై కేసు నమోదు చేశారు. జన్వాడ రిజర్వ్ కాలనీలో రాజ్ పాకాల ఫాం హౌస్ ఉంది.

# కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో అర్ధరాత్రి భారీ శబ్దాలతో పార్టీ

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. ఏ1గా ఫామ్‌హౌస్ సూపర్‌వైజర్ కార్తిక్, ఏ2గా కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను చేర్చామన్నారు. నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వహించినట్లు చెప్పారు. కర్ణాటక లిక్కర్‌తోపాటు విదేశీ మద్యం కూడా కూడా స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏడు లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే రాజ్ పాకాల పరారీలో ఉన్నారని, విచారణలో మరికొన్ని వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌లో క్యాసినో పరికరాలు : క్యాసినో పరికరాలు సైతం స్వాధీనం చేసుకోవడంతో క్యాసినో నిర్వహించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో ప్లేయింగ్ కార్డ్స్, ప్లాస్టిక్ కైన్స్ వంటివి కూడా స్వాధీనం చేసుకున్నారు. భారీ శబ్దాలతో పార్టీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. 30 ఎకరాల్లో రాజ్ పాకాల ఫామ్‌హౌస్ విస్తరించి ఉంది. ఈ ఫామ్‌హౌస్ పార్టీపై బీజేపీ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తోంది. ఇప్పటికే రాజధానిలో అధిక మొత్తంలో డ్రగ్స్, గంజాయిలను పోలీసుల స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఈ జన్వాడ ఫామ్‌హౌస్ అర్ధరాత్రి పార్టీ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# ‘వారిని విధుల్లోకి తీసుకోండి.. లేదంటే మమ్మల్ని సస్పెండ్ చేయండి’

హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు): ‘ఒకే పోలీస్– ఒకే రాష్ట్రం’ నినాదంతో బెటాలియన్ కానిస్టేబుళ్లు చేపట్టిన ఆందోళనలు ఆగడంలేదు. నాలుగైదు రోజులుగా నిరసనలు చేస్తున్న తోటి ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం సరికాదంటూ మరోమారు ఖాకీలు రోడెక్కారు. నిర్ణీత సమయం లేని విధుల వల్ల కుటుంబంతో సమయాన్ని గడపలేకపోతున్నామంటూ ర్యాలీ నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ కార్యాలయాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఏక్ స్టేట్– ఏక్ పోలీస్ అనే నినాదంతో కొద్ది రోజులుగా బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళన చేస్తున్నారు. నిర్ణీత పరిధి లేని విధుల వల్ల కుటుంబంతో సమయం గడపలేకపోతున్నామని రోడెక్కి నిరసన తెలిపారు. సిరిసిల్ల పట్టణం సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్లు ఆందోళనకు దిగారు. అనంతరం కమాండెంట్ శ్రీనివాసరావు ఛాంబర్ వద్ద బైఠాయించి కమాండెంట్ పాలన వద్దంటూ నినాదాలు చేశారు. మీడియాతో మాట్లాడినందుకు సస్పెండ్ చేసిన ఆరుగురు కానిస్టేబుళ్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని



లేదంటే, ఆందోళనలో పాల్గొన్న 200 మందిని సైతం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలంటూ నిరసన : వరంగల్ జిల్లా మామునూరులో టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లోనూ కానిస్టేబుళ్లు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన చేశారని పలువురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు వేయడం సరికాదన్నారు. సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని మామునూరు 4వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. నల్గొండలోని అన్నెపర్తి 12 వ పటాలంలోనూ ఆరుగురు సిబ్బందిని అధికారులు సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఖాకీలు ఆందోళన చేపట్టారు. బెటాలియన్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్‌ను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి 7వ బెటాలియన్ కానిస్టేబుల్స్, డిప్యూటీ కమాండెంట్ ఎమ్‌వై సురేశ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

టీజీఎస్పీ సిబ్బంది కుటుంబాలకు డీజీపీ సూచన : మరోవైపు తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందికి ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. పోలీసుల కుటుంబాలు రహదారులపైకి వచ్చి ధర్నాలు చేయడం సరికాదన్నారు. ఆందోళనలు విరమించి సమస్యలుంటే విన్నవించాలని ఆయన శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఆ సమస్యలను సానుకూల దృక్పథంతో, సానుభూతితో పరిశీలించి సరైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూనిఫాం బలగాల్లో క్రమశిక్షణరాహిత్యం తీవ్రమైన విషయమని, ఆందోళనలు విరమించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

# వైభవంగా మల్లారెడ్డి మనవరాలి వివాహ మహోత్సవం

## వేడుకలో స్పెషల్ అట్రాక్షన్‌గా సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు): నవ వధువులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం, పొంగులేటి – వేడుకకు హాజరైన మాజీ మంత్రులు కేటీఆర్ , సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి మనవరాలు, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కుమార్తె వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. హైదరాబాద్ శివారు శంషాబాద్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం వివాహం జరగగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, రంగారెడ్డి జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ అనిత రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మల్లారెడ్డి మనవరాలి వివాహ మహోత్సవానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు హాజరు కావడంతో వివాహ వేడుకలో ఉత్సాహం పెరిగింది. తన మనవరాలి వివాహానికి హాజరు కావాలంటూ పలువురు రాజకీయ నేతలను, ప్రముఖులను మల్లారెడ్డి ఆహ్వానించారు. ఆయన ఆహ్వానం మేరకు ఇవాళ జరిగిన వివాహ మహోత్సవానికి పలువురు ప్రముఖులు, పార్టీ నేతలు హాజరై, నూతన జంటను ఆశీర్వదించారు. మల్లారెడ్డి సైతం కుటుంబసభ్యులతో పాటు వివాహానికి వచ్చిన వారిని ఆప్యాయంగా స్వాగతించి వేదికపైకి తీసుకెళ్లారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




## మహిళల అభివృద్ధిలో
# రాష్ట్రం దేశానికే ఆదర్శం
### డిప్యూటీ సీఎం భట్టి

**ఖమ్మం, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు):** మహిళల అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్, బస్సు షెల్టర్, కలెక్టరేట్ సిబ్బంది భోజనశాల, లేడీస్ లాంజ్ స్త్రీ టీ క్యాంటీన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు వడ్డీలేని రుణాలు అందజేసి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. వారికి రూ.25 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే ఆర్టీసీలో డ్వాక్రా సంఘాలను భాగస్వామ్యం చేయాలని ఆలోచిస్తున్నామన్నారు.

# కనకదుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట





### విక్రమాచార్యులు, అనిల్ శర్మచే ఆదివారం విగ్రహ ప్రతిష్ట విగ్రహ దాత బాలకృష్ణ, ప్రత్యూష

**కల్లూరు -ప్రభాత సూర్యుడు** మండల శివారు లో కొలువు దీరివున్న పెద్ద చెరువు కట్ట శివఆంజనేయ స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా కోలాటాల నడుమ భక్తిశ్రద్ధలతో ఉదయం 8-01 నిమిషమునకు అమ్మవారి విగ్రహం ప్రతిష్ట కార్యక్రమం దిగ్వయంగా జరిగినది.అనంతరం దుర్గా మల్లేశ్వర స్వామి శాంతి కళ్యాణం వైభవంగా జరిగినది. పొట్రూ కృష్ణయ్య ధర్మపత్ని సూరమ్మ కుమారుడు బాలకృష్ణ ధర్మపత్ని ప్రత్యూష వారి కుటుంబ సభ్యులు, మహత్తరమైన దృడ సంకల్పముతో,,,శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రతిష్టాపన మహోత్సవము వారు నూతన నిర్మించి ఉన్న దేవాలయము నందు,, ది 27.10.2024 ఆదివారం ఉదయం ఎనిమిది గంటలక ఒక్క నిమిషమునకు కనకదుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట జరిగినది. అనంతరం పూజా హెూమాది అభిషేక అర్చనాది కార్యక్రమములు మహా వైభవముగా జరిగినవి.ఈ కార్యక్రమంలో అన్నీ కూడా ప్రతిష్ట ఆధ్వర్యులు శ్రీ విద్యా ఉపాస కులు బ్రహ్మశ్రీ కంభంపాటి సోమశేఖర ఆచార్యులు,వారి కుమారులు, వేదాగమ పండితులు కంభంపాటి అనిల్ శర్మ, పర్యవేక్షణలో, సర్వ దేవత ప్రతిష్ట ఆచార్యులు, బ్రహ్మశ్రీ రామడుగు విక్రమాచార్యులు, ఆధ్వర్య బ్రహ్మత్వంలో. వేదాగమపండితులు, విశ్వనాథుని రామాచార్యులు, మోతుకూరి ఫణీంద్ర ఆచార్యులు,సోము నరేష్ శర్మ, రామడుగు సురేంద్ర శర్మ, విన్నకోట విజయకుమారా చార్యులు, రామడుగు రామకృష్ణమాచార్యులు,రామడుగు వీర లవ కుమారాచార్యులు, గణేష్ ఆచార్యులు, విజయ ఆచార్యులు, సోము కృష్ణమాచార్యులు, గ్రామ భక్తులు మహా వైభవముగా మూడు రోజులపాటు జరుగుతున్నటువంటి మహత్తరమైనటువంటి ప్రతిష్టా కార్యక్రమం విశేషంగా జరిగినది అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో తీర్థప్రసాదాలు తీసుకొని అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించి, కోలాటాలు తిలకించటం మాకు ఒక వరంగా ఉందని స్థానిక ప్రజలు తెలియజేసినారు ఇలాంటి మహెూత్తరమైన కార్యక్రమం ఆ కల్లూరులో జరగటం మా అదృష్టమని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో
# మేనిఫెస్టోలో హామీలను అమలు చెయ్యాలి



**ఖమ్మం -ప్రభాత సూర్యుడు** స్థానిక అమరవీరుల స్తూపం దగ్గర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె వి కృష్ణారావు ,ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు కొన్ని హామీలను ప్రవేశపెట్టింది. ప్రతి ఉద్యమకారుడుకి 250 చదరపు గజాల స్థలాన్ని ఇస్తానని , అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటామని ,అమరవీరుల కుటుంబాలకు 25 వేల రూపాయల పెన్షన్ ని ఇస్తానని చెప్పటం జరిగింది. కావున మీకై మీరే పొందుపరిచారు, మాట ఇచ్చారు, కాబట్టి ఆ మాటను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. శ్రీమతి సోనియా గాంధీ గారు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. ఇప్పుడు కూడా ఆరు గ్యారెంటీల పథకంలో తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలాన్ని ఇస్తానని వాగ్దానం చేశారు. మాకు సోనియా గాంధీ గారి మీద అపారమైన విశ్వాసం నమ్మకం ఉన్నది . ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుచున్నాము . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పగడాల నరేందర్ ,బచ్చల పద్మాచారి, రాచమల్ల ఉమా యాదవ్, లింగన్న బోయిన సతీష్, రెడ్డబోయిన వరలక్ష్మి ,ఎస్ డి బురాన్, శ్రీనివాస్ నాయక్, ఆసిఫ్ ,పెళ్లూరు విజయకుమార్ ,వసీం, నవీన్, కామని అనంతలక్ష్మి ,స్వరూప, ధనలక్ష్మి, యాక లక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట
### దేవరకద్ర ఎమ్మెల్యే గవినోల్ల మధుసూదన్ రెడ్డి



**భూత్పూర్ - ప్రభాత సూర్యుడు** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాల అభివృద్ధి కి పెద్దపీట వేస్తున్నారని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని భూత్పూరు, అడ్డాకుల మండలాలలోని పలు గ్రామాలలో ఆదివారం మధుసూదన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామం జాతీయ రహదారి-44 నుండి గాజులపేట రోడ్డును 50 లక్షల రూపాయల నిధులతో బీటీ రోడ్డు ప్రత్యేక మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉన్నప్పుడే రాకపోకలు సులభంగా కొనసాగుతాయని, అప్పుడే గ్రామాల అభివృద్ధి జరుగుతున్నది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేసినేని శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు లిక్కి నవీన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, గోవర్ధన్ గౌడ్, మొల్లర వెంకటేష్, యూత్ ప్రెసిడెంట్ భూపతిరెడ్డి, రామ్ రెడ్డి, హర్యానాయక్, బాలవర్ధన్ రెడ్డి, పర్వతాలు, కరుణాకర్, నరసింహులు, తిరుపతయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

**రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక**

రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు. అడ్డాకుల మండలం తిమ్మాయి పల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల నుండి వారి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. సన్న వడ్లకు 2,820/-, ఏ గ్రేడ్ వడ్లకు 2,320/- రూపాయల మద్దతు ధర ఇస్తామని, సన్న ఓట్లకు అదనంగా 500 బోనస్ ఉంటుందని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.



# కాలనీల అభివృద్ధికి కృషి
### కోటి రూపాయల నిధులతో యుజీడి, సిసి రోడ్ పనులకు శంకుస్థాపన

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు** అన్ని రకాల మౌలిక సదుపాయాలతో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ చైర్ పర్సన్ పండుగల జయశ్రీ రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు 21వ వార్డులో ఒక కోటి రూపాయల నిధులతో స్థానిక కౌన్సిలర్ ఓరుగంటి సుజాత కిషన్ గౌడ్, చైర్ పర్సన్ పండుగల జయశ్రీ రాజు, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డిలతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్దే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని, వార్డుల్లోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చెవుల హరిశంకర్, నాయకులు ఓరుగంటి కొండల్ గౌడ్, జోర్క శ్రీరాములు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.




## ఆప్తమిత్రుడుని
# పరామర్శించిన తుమ్మల

**సత్తుపల్లి -ప్రభాత సూర్యుడు** సత్తుపల్లి మండలం కాకర్లపల్లి లో సీనియర్ నాయకులు కంచర్ల బాబురావు గారిని ఈరోజు పరామర్శించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు తనకు ఆప్తమిత్రుడైన కంచర్ల బాబురావు గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు మంత్రి తుమ్మల గారి వెంట సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు గారు పువ్వాళ్ళ ఉమా గారు కంచర్ల రమేష్ గారితో పాటు ఆ గ్రామ పెద్దలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు




## తిరుపతికి వరుసగా
# బాంబు బెదిరింపులు
### తాజాగా ఎయిర్‌పోర్ట్‌కు

**తిరుపతి, అక్టోబర్ 27 (ప్రభాత సూర్యుడు):** టెంపుల్ సిటీలో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. వరుస బాంబు బెదిరింపులతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. తిరుపతి విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఈమెయిల్ పంపాడు అగంతకుడు. బెదిరింపు ఈ-మెయిల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు ఎయిర్ పోర్ట్ అథారిటీ అధికారులు. ఈమెయిల్ ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు అధికారులు బృందాలను ఏర్పాటు చేశారు. అంతకుముందు తిరుపతిలోని హెూటల్స్‌కు బాంబు బెదిరింపు కాల్స్ చేశారు అగంతులు. బాంబు పెట్టామంటూ ఈ-మెయిల్స్ పంపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నగరంలో ప్రతీ హెూటల్‌ను తనిఖీ చేశారు. అవి ఫేక్ కాల్స్‌గా నిర్ధారించారు. కేటీ రోడ్డులోని ఆలయాల్లో బాంబు పెట్టామని శనివారం బెదిరింపు కాల్స్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అన్నిఆలయాలను డాగ్ స్క్వాడ్స్‌తో తనిఖీ చేశారు. అటు ముందు జాగ్రత్తగా తిరుపతితో పాటు తిరుమల వెళ్లే మార్గాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు పోలీసులు. బాంబు బెదిరింపుల నేపథ్యంలో ప్రతీ రెండు రోజులకు ఒకసారి తిరుపతిలోని అన్నిహెూటల్స్, జనసంచార ప్రదేశాల్లో తనిఖీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తిరుపతిలో వరుసగా బాంబు బెదిరింపు రావడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో బెదిరింపులకు పాల్పడుతున్నవారిపై పోలీసులు ఫోకస్ చేశారు. త్వరలోనే నిందితుల ఆటకట్టిస్తామంటున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## మిజోరాంలోని ప్రధాన కార్యాలయాన్ని ఖాళీ చేయనున్న అస్సాం రైఫిల్స్

ఐజ్వాల్: మూడు దశాబ్దాల నాటి సమస్య పరిష్కారం కానున్నది. మిజోరాం రాజధాని ఐజ్వాల్‌లో ఉన్న బెటాలియన్ ప్రధాన కార్యాలయాన్ని అస్సాం రైఫిల్స్ ఖాళీ చేయనున్నది. నగరానికి 15 కిలోమీటర్ల దూరానికి స్థావరాన్ని మార్చనున్నది. ఈ మేరకు ఒప్పందం జరిగింది. 1988లో అస్సాం రైఫిల్స్ సిబ్బంది జరిపిన కాల్పుల్లో 12 మంది పౌరులు మరణించారు. దీంతో రాజధాని ఐజ్వాల్ నుంచి అస్సాం రైఫిల్స్ బలగాలను తరలించాలని నాటి సీఎం లాల్‌డెంగా నేతృత్వంలోని ప్రభుత్వం డిమాండ్ చేసింది. కాగా, మూడు దశాబ్దాల తర్వాత ఈ సమస్య పరిష్కారమవుతున్నదని మిజోరాం సీఎం లాల్దుహోమా తెలిపారు. 2025 ఏప్రిల్‌లో ఐజ్వాల్ ప్రధాన కార్యాలయం నుంచి నగరానికి 15 కిమీ దూరంలోని జోఖావ్‌సాంగ్‌లోని స్థావరానికి అస్సాం రైఫిల్స్ బలగాలు వెళ్తాయని తెలిపారు. న్యూఢిల్లీలోని మిజోరాం హౌస్‌లో ఒప్పంద పత్రం (ఎంఓఏ)పై బుధవారం సంతకాలు జరిగినట్లు ఆయన చెప్పారు. మిజోరాం ప్రభుత్వ కమిషనర్, సెక్రటరీ వనలదినా ఫనాయ్, అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేరా ఈ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారని వెల్లడించారు. మరోవైపు 2025 ఏప్రిల్ 1 నుంచి ఈ ఒప్పందం అమలులోకి వస్తుందని మిజోరాం సీఎం లాల్దుహోమా తెలిపారు. జోఖావ్‌సాంగ్‌లో కొన్ని నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. 2025 ఏప్రిల్ నాటికి అస్సాం రైఫిల్స్‌కు తగ్గిన ధరను మిజోరాం ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. అలాగే అస్సాం రైఫిల్స్ అప్పగించిన స్థలాలను సంబంధిత చట్టం ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తామని వెల్లడించారు.

# ఆ నీడలు తొలగేనా?

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచినప్పటికీ, 2024 సార్వత్రిక ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బ నుంచి ఆ పార్టీ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. జూన 4న వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత దేశ రాజకీయాల్లో తన ప్రభ తగ్గిపోయిందని బీజేపీ గ్రహించింది. ఇండియా కూటమి పేరిట విపక్షాలు జతకట్టి గట్టిగా ప్రతిఘటిస్తుండటంతో తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందేందుకు ఆ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.

గత పదేండ్లలో కేంద్రంలో సొంతంగా మెజారిటీ సాధించడంలో కమలం పార్టీ మొదటిసారి విఫలమైంది. ఈ పరిణామం ఆ పార్టీ నేతల ను ఆలోచనలో పడవేసింది. బీజేపీతో పాటు దాని సైద్ధాంతిక గురువు ఆర్ఎస్ఎస్‌లో రాజకీయ ప్రకంపనలు రేకెత్తిస్తూ ఆ పార్టీ ఇప్పుడు తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలోనే ఏం జరిగిందో తెలుసుకోవడానికి, బీజేపీ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎలా అధిగమించాలనే విషయమై ఆ పార్టీ నేతలు మేధోమథనంలో మునిగిపోయారు. ఈ ఏడాది ఆగస్టు 11న ఢిల్లీలోని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నివాసంలో మొదటి మేధోమథన సమావేశం జరిగింది. ఐదు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో అమిత్ షా, జేపీ నడ్డా, అరుణ్‌సింగ్, బీఎల్ సంతోష్, దత్తాత్రేయ హొసబలే తదితరులు పాల్గొన్నారు.

నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడి నియామకం ఇప్పుడు వారి ముందున్న తక్షణ కర్తవ్యం. వసుంధర రాజే, సంజయ్ జోషి, వినోద్ తావ్‌డే, ఓం మాథుర్, భూపేంద్ర యాదవ్ తదితరుల పేర్లు ప్రతిపాదనలో ఉన్నాయి. ఈ చర్చలు కొత్త అధ్యక్షుడి అన్వేషణకే పరిమితం కాలేదు. అగాథంలో కూరుకుపోయిన బీజేపీని బయటపడేసేందుకు అవసరమైన మార్గాలను వెతికేందుకు కూడా. ఆర్ఎస్ఎస్-ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్-బీజేపీ మధ్య సంబంధాలు ఇప్పుడు ఊగిసలాటలో ఉన్నాయి. బీజేపీలో వ్యవహారశైలిని మార్చాలనే ప్రయత్నాలు జరుగుతుండటం మరో ప్రధాన సమస్య. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీకి ఆర్ఎస్ఎస్ అవసరం లేదని, సొంతంగానే విజయతీరాలకు చేరే శక్తిసామర్థ్యాలు పార్టీకి ఉన్నాయని గతంలో జాతీయ




అధ్యక్షుడు నడ్డా పేర్కొన్నారు. సహజంగానే సంఘ్‌కు ఈ వ్యాఖ్యలు నచ్చలేదు. దీంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య మాటల యుద్ధానికి తెరతీశాయి.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన భారతీయ జన్‌సంఘ్ 1977లో జనతా పార్టీలో విలీనమైంది. ఆ తర్వాత కొన్నేండ్లకే ద్వంద్వ సభ్యత్వ వివాదం నేపథ్యంలో జనతా పార్టీ నుంచి జన్‌సంఘ్ బయటకు రావాల్సి వచ్చింది. 1980 ఏప్రిల్ 6న బీజేపీ ని స్థాపించారు. అప్పటినుంచి జన్‌సంఘ్‌తో కలిసి పనిచేసినట్టే బీజేపీతోనూ పనిచేసిన ఆర్ఎస్ఎస్‌కు ఆ పార్టీలో భారీగా పలుకుబడి ఉన్నది. గత పదేండ్లలో బీజేపీ అధ్యక్షుల ఎంపికలో ప్రధాని మోదీకి పూర్తి స్వేచ్ఛ లభించిందని ఆర్ఎస్ఎస్‌కు బాగా తెలుసు. 2014లో అమిత్ షా, 2019లో జేపీ నడ్డాల నియామకం పూర్తిగా మోదీ ఇష్టానుసారమే జరిగింది. వారి ఎంపికలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా తమకు ప్రీతిపాత్రుడైన వ్యక్తినే కొత్త అధ్యక్షుడిగా నియమిస్తారని ఆర్ఎస్ఎస్ భావిస్తున్నది. అంతేకాదు, ఏండ్ల తరబడి రూపుదిద్దుకున్న బలీయమైన, అతిపెద్ద పార్టీగా కాకుండా మోదీ ప్రభతో, మోదీ నీడలో ఇప్పుడు బీజేపీ నడుస్తున్నదనే భావన ఆర్ఎస్ఎస్‌లో నెలకొన్నది. ఈ పరిణామం పార్టీలో సంఘ్ మాట చెల్లుబాటు కాకుండా పోవడానికి దారితీసింది.

గతంలో బీజేపీ అధ్యక్షుడి ఎంపికలోనే కాదు, విధానపరమైన నిర్ణయాల్లోనూ ఆర్ఎస్ఎస్‌కు పెద్దపీట వేసేవారు. 2005లో పాకిస్థాన్ పర్యటనలో మహమ్మద్ అలీ జిన్నాను అప్పటి బీజేపీ అధ్యక్షుడు ఎల్‌కే అద్వానీ పొగడటాన్ని ఆర్ఎస్ఎస్ తీవ్రంగా తప్పుబట్టింది. తక్షణమే ఆయనను అధ్యక్ష పీఠం నుంచి తప్పించి, ఆయన స్థానంలో రాజ్‌నాథ్‌సింగ్‌ను కూర్చోబెట్టింది.

ఆ తర్వాత నితిన్ గడ్కరీ అధ్యక్షుడు కావడంలోనూ ఆర్ఎస్ఎస్ కీలకపాత్ర పోషించింది. ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా తన పదవీకాలాన్ని పూర్తిచేసుకోవడమే కాదు, ఆయనకు ఆరు నెలల పొడగింపు కూడా లభించింది. పార్టీకి కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు ఆయ నే కొనసాగుతారు. అదేవిధంగా ఆర్ఎస్ఎస్ ప్రచారక్ బీఎల్ సంతోష్ బీజేపీ జనరల్ సెక్రెటరీగా (సంస్థాగత) రెండు పర్యాయాల పదవీకాలాన్ని పూర్తిచేసుకున్నారు. ఆయనను మరోసారి కొనసాగిస్తారా? లేక ప్రత్యామ్నాయాన్ని సంఘ్ చూస్తుందా? అనేది వేచిచూడాలి. ఆర్ఎస్ఎస్ నుంచి డిప్యుటేషన్‌పై బీజేపీలోకి వెళ్లేవారికి రెండు పర్యాయాలకు మించి అవకాశం ఇవ్వకూడదనేది అప్రకటిత నిబంధన. సంఘ్, బీజేపీ మధ్య సమన్వయం కోసం బీజేపీ జనరల్ సెక్రెటరీ (ఆర్గనైజేషన్) పదవి అనేది చాలా శక్తిమంతమైనది.

ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న, క్షేత్రస్థాయిలో ప్రజాదరణ ఉన్న నాయకుడిని నూతన అధ్యక్షుడిగా సంఘ్ మొదటగా నియమిస్తుంది. ఒకవేళ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్‌ల సమ్మతి తప్పనిసరి అయితే, ఆ వ్యక్తి సంఘ్‌కు కూడా ఆమోదయోగ్యంగా ఉండాలి. అటువంటి అధ్యక్షుడికే పార్టీని నడపడానికి అవసరమైన పూర్తి స్వేచ్ఛ, అధికారం ఉంటుంది. మోదీ నీడ నుంచి పార్టీని బయటపడేసే లక్ష్యంతో పార్టీ కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించేలా నూతన అధ్యక్షుడు సూచనలు చేసే ఆస్కారం ఉంటుంది. ఈ తరుణంలో ప్రస్తుత రాజకీయ సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా బీజేపీని సంసిద్ధం చేయడమే ఇప్పుడు సంఘ్ ముందున్న అతి ముఖ్యమైన లక్ష్యం.



# అసమానతల భారతం

ఐఎంఎఫ్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. అయినప్పటికీ, మన దేశంలోని అనేక నగరాల్లో ఖరీదైన విల్లాల పక్కనే మురికివాడలు దర్శనమిస్తాయి. ముంబైలో ఉన్న ఆసియాలోనే అతిపెద్ద మురికివాడ ధారావి అందుకు నిదర్శనం.

మన దేశ వృద్ధి అంతంతమాత్రంగానే ఉండి, ఆదాయ అసమానతలకు దారితీయడానికి ఒక కారణం ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై తక్కువ పెట్టుబడులు పెట్టడమే ఆదాయ అసమానతలకు ప్రధాన కారణమని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ గతంలో పేర్కొన్నారు. తద్వారా అధిక ఆదాయ వర్గాల్లోని విద్యావంతులు, ఆరోగ్యవంతులు వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ నుంచి డబ్బు సంపాదించేందుకు ఎక్కువ అవకాశాలను పొందారు. అదే సమయంలో అత్యల్ప ఆదాయ వర్గాల్లోని నిరక్షరాస్యులైన కార్మికులు ఇప్పటికీ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకే కష్టపడుతున్నారు.

ప్రపంచ అసమానతల నివేదిక- 2022 ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక ఆదాయ అసమానతలు కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. దేశ వృద్ధిని గొప్పగా ప్రచారం చేస్తున్న మీడియాలోని ఒక వర్గం అంతర్గత సమస్యలను కప్పిపుచ్చుతున్నది. విదేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు ఇటీవల ఒక వార్త హల్‌చల్ చేసింది. ప్రజల ఆదాయం పెరిగినట్టు దీని ద్వారా పైకి తెలుస్తున్నప్పటికీ.. అసలు వాస్తవం వేరే ఉన్నది. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో లక్షల మంది విమాన ప్రయాణం చేసినంత మాత్రాన ఆదాయం పెరిగినట్టు కాదు. అమెరికాలో ఆదాయ అసమానతలు భారీగా ఉన్నప్పటికీ, ఆ దేశ ప్రజలు కూడా విమానయానం ఎక్కువగానే చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే.. విదేశాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగినంత మాత్రాన దేశంలో అసమానతలు తగ్గి, ఆదాయ పంపిణీ మెరుగైనట్టు కాదు.


గృహ సర్వేల ఆధారంగా అసమానతలను పలు సర్వే సంస్థలు అంచనా వేస్తాయి. అయితే, ఇవన్నీ స్వీయ ప్రకటిత ఆదాయాలపై ఆధారపడి చేసిన సర్వేలే. విదేశాల నుంచి లభించే ఆదాయాలు లేదా నల్లధనం ఈ నివేదికలకు చిక్కవు. అందుకే, నివేదికల్లో పేర్కొన్న దానికంటే మరింత ఎక్కువగా వాస్తవ అసమానత ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ, ఈడీల చేతికి చిక్కకుండా ఉండేందుకు ధనవంతులు నల్లధనాన్ని ఎక్కువగా విదేశాల్లో దాచిపెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. షెల్ కంపెనీలు, అనామక ట్రస్టుల ద్వారా నిధులు మళ్లిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి తప్పించుకుంటున్నారు. విదేశాల్లో నల్లధనం దాచిన చాలామంది భారతీయుల వివరాలను 2013లో పనామా పేపర్స్ బహిర్గతం చేశాయి. వాషింగ్టన్ డీసీకి చెందిన గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ (జీఎఫ్ఐ) నివేదిక ప్రకారం.. 1948-2008 మధ్యకాలంలో 213.2 బిలియన్ డాలర్ల నల్లధనం మన దేశం నుంచి తరలిపోయింది. అయితే, సరైన ఆధారాలు లేకపోవడం, అంతర్జాతీయంగా ఉండే సంక్లిష్టతల కారణంగా వారిపై చర్యలు తీసుకోవడానికి వీల్లేకుండాపోయింది.

సాధారణంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందితే.. అది పన్నులు, ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలి. ఉదాహరణకు వ్యాపారాలు వృద్ధి చెంది కంపెనీలకు ఎక్కువ లాభాలు వస్తే.. కార్పొరేట్ పన్ను పెరుగుతుంది. ఉపాధి పెరగడం ద్వారా ఆదాయ పన్ను పెరుగుతుంది. ప్రజలు ఎక్కువగా ఖర్చు చేయడం మూలంగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతాయి. కానీ, వేగవంతమైన ఈ వృద్ధి సంఘటిత రంగంలో ఉద్యోగాలను సృష్టించడం లేదు. అందువల్ల ఎక్కువమంది అసంఘటిత రంగంలో పని చేస్తూ పొట్ట పోసుకోవాల్సి వస్తున్నది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినప్పటికీ ప్రజల ఆదాయం మాత్రం మందగిస్తున్నది. అంతేకాదు, తత్ఫలితంగా జీడీపీ కూడా తగ్గుముఖం పడుతున్నది. అందరి భారం తామే ఎందుకు మోయాలనే ఉద్దేశంతో చాలామంది పన్నులను ఎగవేసేందుకు దారులు వెతుకుతున్నారు.

సంపద, ఆదాయ పంపిణీలో తీవ్రమైన అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్యం వెనుకబాటుతనానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. 2014లో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ పెరుగుతున్న ఆదాయ అసమానతలు, ప్రజాస్వామ్య వెనుకబాటుతనానికి మధ్య స్పష్టమైన సంబంధం ఉంది. ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, సబ్సిడీలు ప్రజల మధ్య ఉన్న ఆదాయ అసమానతలను తగ్గించడంలో విఫలమయ్యాయనే చెప్పాలి. అంతేకాదు, ఇవి ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి మద్దతును కూడగట్టడంలోనూ విఫలమయ్యాయి. అందుకే బీజేపీ సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో ఆదాయ అసమానతలు లేని, సంపద పంపిణీ అందరికీ సమానంగా జరిగే ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరమున్నది.

# ప్రజలకు కాంగ్రెస్ కరెంట్ షాక్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గవలసి వస్తుందని ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రజలను భయపెట్టారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ హయాంలో నిత్యం విద్యుత్ కోతలతో సతమతమయ్యారు. అనేక చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. ఎంతోమంది ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ సర్కార్ మొదట విద్యుత్‌రంగంపైనే దృష్టి సారించింది. ఈ క్రమంలోనే పదేండ్ల పాటు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సుపరిపాలనను అందించింది. అయితే, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా ఇప్పుడు ప్రజలకు కరెంట్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతుండటం ఆందోళనకరం. పరాయి పాలకుల హయాంలో కరెంటు సమస్యలతో అతలాకుతలమైన తెలంగాణ ప్రాంత ప్రజలు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఊపిరి పీల్చుకున్నా రు. కేసీఆర్ హయాంలో విద్యుత్‌రంగ స్వరూపమే మారిపోయింది. ప్రణాళికా బద్ధంగా కేసీఆర్ చేపట్టిన చర్యలతో విద్యుత్తు కోతలకు అడ్డుకట్ట పడింది. విద్యుత్తు ఉత్పాదనలో తెలంగాణ మిగులు రాష్ట్రం గా అవతరించింది. అయితే, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ఒక్కసారిగా విద్యుత్ సంక్షోభం తలెత్తింది. విద్యుత్ ఉత్పాదన, నిర్వహణా లోపాల కారణంగా కోతలు పునరావృతమవుతున్నాయి. అయితే, ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీల పెం పుతో పెనుభారం మోపేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధపడుతుండటం ఆందోళనకరం. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలు హామీలు అమలుచేయాలని ఒత్తిడి చేస్తుండటంతో వారిపై రకరకాల పన్నుల భారాన్ని మోపుతున్నది. తెలంగాణలోనే కాకుండా కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు దొడ్డిదారిన ప్రజలపై భారం మోపుతున్నాయి. గ్యారెంటీలను అమలుచేయలేక కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నాయి. ఒక ప్రణాళిక లేని పాలనతో తప్పటడుగులు వేస్తున్న కాంగ్రెస్ సర్కార్ విద్యుత్ చార్జీలు పెంచాలనే ప్రతిపాదనలను తెరపైకి తీసు కువచ్చింది. తద్వారా ప్రజలపై రూ.18, 500 కోట్ల మేర అదనపు భారం పడే



అవ కాశాలున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.14,222 కోట్లు ఆదాయలోటు ఉన్నదని డిస్కంలు విద్యుత్ నియంత్రణ మండలిలో పిటిషన్ దాఖలు చేశాయి. ఉత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్న కరెంట్‌కు, వినియోగదారులకు పంపిణీ చేస్తున్న కరెంటుకు మధ్య భారీ లోటు ఉన్నదని, దాన్ని పూడ్చేందుకుగాను చార్జీల పెంపునకు అవకాశమివ్వాలని ఈఆర్సీకి విన్నవించాయి. అయి తే, వాస్తవ రెవెన్యూ వ్యత్యాసం రూ.5,95 8 కోట్లు మాత్రమే ఉంటుందని ఎస్పీడీసీఎల్ అంచనా వేస్తుండటం గమనార్హం. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఇప్పటికే వ్యవసాయరంగం మొదలుకొని పారిశ్రామికరంగం వరకు అన్నిరంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. ఈ దశ లో విద్యుత్ చార్జీల పెంపు సరికాదని, ప్రతిపాదనలను తిరస్కరించాలని విద్యుత్ నియంత్రణ మండలికి బీఆర్ఎస్ విజ్ఞాప న పత్రం అందజేసింది. పారిశ్రామికరంగానికి సంబంధించి అన్ని క్యాటగిరీలకు ఒకేరకంగా చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అంతేకాదు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరవాలనే కుట్ర చేస్తున్నది. హైటెన్షన్ (హెచ్‌టీ) వినియోగదారులకు 11 కేవీ కనెక్షన్‌కు వసూలు చేస్తున్నట్టుగానే.. 33 కేవీ, 132 కేవీ కనెక్షన్లకు కూడా చార్జీలు వసూ లు చేయాలనే ప్రతిపాదనలున్నాయి. ప్రస్తుతం పరిశ్రమలకు సంబంధించి 11 కేవీ యూనిట్‌కు రూ.7.65, 33 కేవీకి రూ.7.15, 132 కేవీకి రూ.6.65 చొప్పు న డిస్కంలు వసూలు చేస్తున్నాయి. అయి తే, ఇకపై ఈ మూడు క్యాటగిరీలకు 11 కేవీ మాదిరిగానే యూనిట్‌కు రూ.7.65 చొప్పున వసూలు చేస్తే పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. పరిశ్రమలపైనే కాకుండా స్థిర చార్జీల పేరిట గృహ వినియోగదారులపై గుదిబండ మోపాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్న ది. ఇండ్లల్లో వాడుకునే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్ డ్ ఛార్జీ ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా.. దాన్ని రూ.50కి పెంచాలని డిస్కం లు కోరాయి. అంటే ప్రజలపై ఐదు రెట్ల భారం పడనున్నది. 200 యూనిట్లలోపు వాడే వినియోగదారులకు గృహజ్యోతి పేరి ట ఉచిత కరెంటు ఇస్తామని చెప్పిన కాం గ్రెస్ సర్కారు లబ్ధిదారుల సంఖ్యలో భారీ గా కోత పెట్టింది. గతంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కేసీఆర్ సర్కార్ ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని పడనీయలేదు. విద్యుత్ చార్జీలు పెంచాలని డిస్కంలు ప్రతిపాదనలు పంపి నా కేసీఆర్ ప్రభుత్వం అంగీకరించలేదు. అంతేకాదు, వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందించిన కేసీఆర్ సర్కార్ రూ.వేల కోట్ల భారాన్ని మోసింది. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనను పదేండ్లలో మూడు రెట్లకు పైగా పెంచింది. విద్యుత్ రంగంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విప్లవాత్మక మార్పు ల కారణంగా రాష్ట్రంలో ఉపాధి అవకాశా లు పెరిగాయి. పారిశ్రామికంగా రాష్ట్రం కొత్త పుంతలు తొక్కింది. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తి డి చేసినా కేసీఆర్ సర్కార్ అంగీకరించలే దు. అయితే, ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి తెలపాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ నిలదీసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొహం చాటేశారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215